ప్రజాశక్తి

బుధవారం 21 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఇంకా విషమంగానే...

- విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స
- కెజిహెచ్‌లో కొత్తగా 24 మంది చేరిక
- విషమంగా ఉన్న వారికి ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం

విద్యార్థిని కెజిహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో మంగళవారం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విశాఖ కెజిహెచ్‌లో 38 మంది, నర్సీపట్నంలో 22 మంది, పాడేరులో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

విశాఖ కలెక్టరేట్ : అస్వస్థతకు గురైన చిన్నారులలో సోమవారం 14 మంది కెజిహెచ్‌కు రాగా మంగళవారం 24 మంది విద్యార్థులు వచ్చి చేరారు. దీంతో మొత్తం బాధితుల సంఖ్య 38 కి చేరింది. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. విషమంగా ఉన్న ఐదుగురికి కెజిహెచ్‌లోనే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మీడియాకు తెలిపారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న 22 మంది పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అనకాపల్లి జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీర జ్యోతి మంగళవారం మీడియాకు తెలిపారు. పూర్తిగా కోలుకున్నాక వారిని ఇంటికి పంపిస్తామని చెప్పారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మిగతా 2లో..

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

24న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.పోలినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు 2, 5 స్థాయీ సంఘాల సమావేశాలు, 11 గంటలకు 4, 3 స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు 6, 7, 1 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి హైదరాబాద్ - కటక్ - హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 07165 హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 17 వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్ - హైదరాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 18 వరకు ప్రతి బుధవారమూ రాత్రి 22:30 గంటలకు కటక్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:35 గంటలకు దువ్వాడ, అదేరోజు రాత్రి 21:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు

సికింద్రాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హమాపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, మీదుగా ప్రయాణిస్తాయి. ప్రజలు ఈ ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

ఘనంగా ఎన్ఎస్‌టిఎల్ వార్షికోత్సవం

▶ వార్త 4లో..

నర్సీపట్నం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు : అయ్యన్నపాత్రుడు

▶ వార్త 8లో..

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి

▶ వార్త 3లో..

ఎయు పరిధిలో నేటి పరీక్షలు వాయిదా

▶ వార్త మెయిన్‌లో..

విశాఖ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

హత్యాచారంపై నిరసనల హోరు

న్యాయవాదులు, ఉద్యోగులు సంఘీభావం

వార్త 8లో..

28 నుంచి పోర్టులో సమ్మె

అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మేజర్ పోర్టుల్లో ఈనెల 28 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు, విశాఖ హార్బర్ పోర్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్ మాట్లాడుతూ, 2022 జనవరి ఒకటి నుంచి జరగాల్సిన కొత్త వేతన ఒప్పందం కోసం ఏర్పాటు చేసిన కమిటీ 8 సమావేశాలు జరిగి, 32 నెలలు పూర్తయినా న్యాయబద్ధమైన ఒప్పందం ఇప్పటికీ జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో లేని విధంగా అనేక అశాస్త్రీయమైన, అన్యాయమైన షరతులు పెట్టి ఒప్పందం జరగకుండా ఆటంకం కలిగించడమేనని దీనికి ప్రధాన కారణమని తెలిపారు. కీలకమైన ఫిట్మెంట్ బెనిఫిట్స్, డిఎ మెర్జింగ్ పే-స్కేల్స్, వేతన ఒప్పంద బకాయిల చెల్లింపు మొదలైన అంశాలపై సానుకూలంగా చర్చలు లేవన్నారు. గత 3 సంవత్సరాల బోనస్ (పిఎల్ఆర్) చెల్లింపు, పెన్షనర్ల సమస్యలు వంటి మిగతా 2లో..

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

మొదటి పేజీ తరువాయి..

ఇంకా విషమంగానే...

శిరీష పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న చిన్నారుల్లో పాగి.అనురాధ, వంతల గౌతం, మారి అలేఖ్య, వంతల శైలి, తబిటి రాము, సైది లక్ష్మి, పాగి శాంతిశ్రీ, బొరడ జ్యోతి, తంబలి శ్రీను, సందరి డేవిడ్, తంబలి నందిని, ఎస్ కుమారి, పాగి లలిత, పాగి మేరి, వంతల సత్యం, పాగి అరవింద్, ఎస్.అనంత్, సంధి రవి, వంతల సంధ్య, పాగి అంజలి, పాగి శివాజీ, పాగి జగన్ తదితరులు ఉన్నారు.

పాడేరు : పాడేరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎనిమిది మందిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ విశాఖ తరలించారు. మెడికవర్ ఆసుపత్రికి ముగ్గురిని, కిమ్స్‌కు ఇద్దరిని, రెయిన్‌బోకు ఒకరిని తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

మెరుగైన వైద్యం: రామగిడ్డయ్య

కోటవురట్ల : నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య, నర్సీపట్నం ఆర్‌డిఒ జయరామ్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిహెచ్‌సి సిబ్బందిని ఆదేశించారు. ఘటన చాలా బాధాకరమని, కేవలం నిర్వాహకుని నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు రామగిడ్డయ్య తెలిపారు. సమగ్ర విచారణ చేపడుతున్నామన్నారు.

కొనసాగుతున్న విచారణ

ఘటనపై రెవెన్యూ, పోలీస్ అధికారుల విచారణ కొనసాగిస్తున్నారు. నిర్వాహకునిపై బిఎన్ఎస్ 105 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సిఐ అప్పన్న తెలిపారు. నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను చోడవరం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా రిమాండ్ విధించారని, అతనిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. నిర్వాహకుని బ్యాంకు అకౌంట్లు సీజ్ చేసినట్లు చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆశ్రమం ఏర్పాటు చేయడం, నిర్వాహకుడు చెబుతున్న విద్యార్థుల సంఖ్యకు ఆశ్రమం పొందుతున్న విద్యార్థుల సంఖ్యకు తేడాపై ఆరాతీస్తున్నట్లు వివరించారు.

పలువురి పరామర్శ

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాలలను పరామర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాలలకు సరైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

కెజిహెచ్ పిడియాట్రిక్స్ వార్డులో చికిత్స పొందుతున్న పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తిలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదిక చికిత్సతో పాటు మరింత మెరుగైన వైద్యం కోసం ముగ్గురు పిల్లలను నగరంలోని ఇతర ఆసుపత్రుల్లో చేర్పినట్లు వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోటవురట్ల స్థానిక అధికారులపై క్రమ శిక్షణా చర్యలు చేపట్టేలా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలను పరామర్శించిన వారిలో ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధ, సభ్యులు లక్ష్మి, ఎం.రజని, సూర్యనారాయణ,విజయలక్ష్మి, సిడిపిఒ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, పిఒఐ సి.రమేష్, కెజిహెచ్ ఒన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులున్నారు.

28 నుంచి పోర్టులో సమ్మె

ఇంకా అనేక డిమాండ్లు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. మేజర్ పోర్టుల ఆస్తులను అమ్మకానికి పెట్టి ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చడానికి మరింత దేశ, విదేశీ ప్రైవేట్ కంపెనీలను ఆకర్షించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ మోడల్ కన్సెషన్ అగ్రిమెంటులో చాలా మార్పులను కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. నేషనల్ ఎసెట్స్ మోనటైజేషన్ పైప్ లైన్ పథకం కింద మేజర్ పోర్టుల ఆస్తులను అమ్మకానికి పెడుతుందని తెలిపారు. పోర్టుల అభివృద్ధికి కృషి చేసిన కార్మికులకు, అధికారులకు, పెన్షనర్స్‌కు, ఆరోగ్య అవసరాలు తీరుస్తున్న పోర్టు హాస్పిటల్ సైతం పిపిపి క్రింద ప్రైవేట్‌కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గం అన్నారు. పోర్టు సెక్టార్‌ను పూర్తిగా ప్రైవేట్ పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. దేశానికి వెన్నెముక లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు కారు చౌకగా పెట్టుబడిదారుల వశం అవుతున్నాయని, ఈ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మేజర్ పోర్టుల ఫెడరేషన్ల నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు విశాఖపట్నం పోర్టులో కూడా ఈ నెల 28 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలనే అన్ని యూనియన్లు సంయుక్తంగా పిలుపును నిచ్చాయని, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మంగయ్యనాయుడు, జనతాపోర్టు, డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఎఫ్‌టియుఐ) నాయకులు ఎన్.కన్యకారావు, నేషనల్ పోర్టు ట్రస్టు ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి.చందు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్ సెక్రటరీ బి.లక్ష్మణరావు, సిఐటియు జనరల్ సెక్రటరీ కూన సత్యనారాయణ, ఉరుకూటి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళిక

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రణాళికను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్, చేపల మార్కెట్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ముఖ్యంగా ఫిషింగ్ హార్బర్ సిసి కెమెరాలు, బోర్ వెల్, రోడ్లు, వాటర్, సెక్యూరిటీ, పారిశుధ్యం తదితర సమస్యలను వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఫిషింగ్ హార్బర్ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని, దానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయని తెలిపారు. బోటు యజమానులతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య, కొత్త మార్కెట్ ఏర్పాటు, చేపల స్టోరేజ్ సమస్యల గురించి చర్చించారు. దీనికి అవసరమైన నిధులు కేటాయిస్తామని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో హార్బర్‌ను పూర్తిగా ఆధునికరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార పెద్దలు, కూటమి శ్రేణులు, ఫిషరీస్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కెజిహెచ్‌లో సేవలకు అంతరాయం లేదు

సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో మంగళవారం ఒపి, అత్యవసర సేవలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో వైద్యం అందించినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో ఒపి, ఐపి, అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. జూనియర్ డాక్టర్లు పనిని బహిష్కరించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురైనప్పటికి కెజిహెచ్‌లో మంగళవారం 1612 మంది ఒపి రోగులు, 8 ఐపి (ఇన్ పేషెంట్) రోగులు, 43 కాజువల్టీ, ఎమర్జన్సీ రోగులు చికిత్స పొందారని వివరించారు. 4 మేజర్, 3 మైనర్ సర్జరీలు కూడా చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవల కోసం సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎక్కడ ఉన్నా క్యాజువాలిటీకి, ఎమర్జన్సీ సర్వీసుల్లో రోగులకు ఎటువంటి అంతరాయం లేకుండా వైద్య చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఒపిలకు ప్రీ, పారా క్లినికల్ ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్లు, సర్వీస్ పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యులను ఏర్పాటుచేయడం ద్వారా రోగి చికిత్సకు ఎటువంటి ఆటంకం కల్గించకుండా చూసినట్లు తెలిపారు.

ఉడా పార్కులో కమిషనర్ పర్యటన

ఉడా పార్కులో పలు సూచనలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం బీచ్ రోడ్‌లోని ఉడా పార్కు ను సందర్శించారు. ఫేస్-2 లో ఉన్న స్కేటింగ్ రింక్ చుట్టు తుప్పు పట్టిన హ్యాండ్ రైలింగ్స్‌ను తక్షణమే మార్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం పెంపొందించాలని, బీచ్ కాంపౌండ్ వాల్ మీద ఉన్న తుప్పు పట్టిన గ్రిల్స్ స్థానే ఇటుక గోడ నిర్మించాలని ఆదేశాలు జారీచేశారు. ఫేస్ -1 పిల్లల ఆటల ప్రాంగణంలో పాడైపోయిన ఇపిడిఎం రబ్బర్ ఫ్లోరింగ్ టైల్స్‌ను త్వరగా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్ఇ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్‌వివిఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివాని, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ సుధీర్, మురళీకృష్ణ, సహాయ ఇంజినీర్ హసీనా బేగం, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, సీతమ్మధార : ఉపకార ట్రస్ట్ ఛైర్మన్ కంచర్ల అచ్యుతరావు, చిరంజీవి యువత విశాఖ జిల్లా ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన సాగర తీరంలో నిర్వహించే వేడుకల పోస్టర్‌ను జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్, జనసేన వైద్య విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి రఘు, కార్పొరేటర్ కందుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరంజీవి పుట్టిన రోజు ఒక వేడుకలా కొనసాగుతుందన్నారు. చిరంజీవి యువత విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎల్లాజీరావు మాట్లాడుతూ ఈ ఏడాది బీచ్ రోడ్డులో వేడుక ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని. తెలిపారు. ఈ వేడుకకు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పంచకర్ల రమేష్, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

27న బహిరంగ వేలం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి జోన్ -1 (భీమిలి)లో ఖాళీగా ఉన్న దుకాణాలకు, రోడ్డు మార్జిన్, మార్కెట్లకు ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు జోన్-1 కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. మూడో వార్డు పరిధి భీమిలి రోడ్డు జి+1 దుకాణం, పెద్ద బజార్ మీసేవ మేడపైన గల దుకాణంలో మూడేళ్ల కాల పరిమితికి, భీమునిపట్నం రోడ్డు మార్జిన్, లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్ నందు ఆశీళ్లకు ఇచ్చిన తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు ఈ బహిరంగ వేలంలో పాల్గొనవలసినదిగా కోరారు. పూర్తి వివరాలకు జోన్-1, భీమిలి కార్యాలయ పని దినాలలో సంప్రదించాలని సూచించారు.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 179/2023

బిట్వీన్:
బొడ్డేడ ఆదినారాయణ . . . వాది
అండ్:
భీమనాధం శ్రీనివాసరావు . . . ప్రతివాది
సమను
1.భీమనాధం శ్రీనివాసరావు, తండ్రి భీమనాధం సదశివరావు, డో.నెం. 49-8-19 వినాయక మ్యూజికల్స్ జగన్నాధపురం, విశాఖపట్నం.
పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:30-8-2024దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ లాయరుగారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.
చందక వీరకృష్ణ
అడ్వకేట్,
అనకాపల్లి.

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో
O.S.NO:15/2023.

మధ్యన:
1. పసుపుల మహేష్ . . . వాది
మరియు:
ఉద్దండరావు వెంకట గిరి . . . ప్రతివాది
టు:
ప్రతివాది:
1. ఉద్దండరావు వెంకట గిరి తండ్రి తిరుపతిరావు, హిందూ, వయస్సు 47 సంవత్సరాలు, వ్యాపారం, 40 -54-52/1సంజీవ నగర్ కాలనీ -1, తాటిచెట్లపాలెం విశాఖపట్నం. పిన్: 530004
జనరలు నోటీసు
యిందలివాది 15-7-2020 ప్రోనోటు డాక్యుమెంట్ ద్వారా దావా మొత్తాన్ని ప్రతివాది నుండి రికవరీ కోసం వాదికి అనుకూలంగా డిక్రీని పాస్ చేయమని కోరుచూ పై నెంబరు దావా ధాఖలు చేసినందున, ప్రతివాదికి యెన్ని సార్లు దావా నమన్సు వంపిననను తీసుకోనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషను ద్వారా నోటీసు వంపమని ఆదేశించినందున ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు పంపడమయినది సదరు విషయములో మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నాను **తేది 02-09-2024 ఉదయము 10-30** గంటలకు పై కోర్టు వారి యెదుట స్వయముగా కాని అడ్వొకేటు ద్వారా కాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపర్చవలేను లేనిచో సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయబడురు అని ఈ నోటీసు మూలంగా తెలియపర్చడమైనది.
గొలుసు శంకర రావు
నర్సీపట్నం. పిటిషనరు తరుపున న్యాయవాది
తే:19-08-2024 సెల్: 9440403999.

పైపులైను వేశారు.. రోడ్డు మరిచారు

- అలసత్వపు పనులతో 'శ్రమజీవుల' అవస్థలు
- రాళ్లు తేలిన రహదారితో రాకపోకలకు ఇక్కట్లు
- మూడు నెలలైనా పట్టించుకోని అధికారులు

రాళ్లు తేలి అధ్వానంగా మారిన శ్రమజీవుల కాలనీ రోడ్డు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం బాలికల హాస్టల్‌కు వెళ్లే మార్గం, శ్రమజీవుల కాలనీ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం, అలసత్వంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం రోడ్డు మధ్యలో తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తిచేసినా, తర్వాత రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లుతేలి, అధ్వానంగా మారిన రహదారితో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో పైప్ లైన్లు ఏర్పాటుతో ఉన్న రోడ్డును శిథిలం చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు, తర్వాత మిగతా పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగాపై స్థానికులు మండిపడుతున్నారు.

బాలికల హాస్టల్‌కు వెళ్లే మార్గం, శ్రమజీవుల కాలనీకి రోడ్డు వేయాలని నాలుగేళ్లుగా స్థానికులు పలుమార్లు నేతలు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, వెంకట్రావు చొరవ తీసుకొని రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించారు. రోడ్డు పనుల్లో భాగంగా వర్షపు, మురుగునీరు మళ్లిపోయేందుకు రోడ్డు మధ్యలో గోతులు తీసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేశారు. తర్వాత ఆ గోతులను పైపైనే పూడ్చేసినా, మిగతా రోడ్డు పనులు మాత్రం చేపట్టలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పైపుల ఏర్పాటుకు తీసిన గోతుల్లో మట్టి కుంగిపోవడం, కొట్టుకుపోవడంతో రాళ్లు తేలి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏటవాలుగా ఉన్న ఈ రోడ్డు మధ్యలో పైపులైన్ గోయ్యి ఇపుడు బాటగా ఏర్పడడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక మట్టి కరిగి రాళ్లు తేలిపోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, శ్రమజీవులకాలనీ, బాలిక హాస్టల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

గాయని జ్యోతికి 'స్వరకోకిల' బిరుదు

ప్రజాశక్తి-సీతమ్మధార : మూడు దశాబ్దాలుగా వివిధ ఆర్కెస్ట్రాలలో వేలాది పాటలతో ప్రేక్షకులను రంజింపజేసిన మధురగాయని గారపాటి జ్యోతికి స్వరకోకిల బిరుదు ప్రదానం చేయడం అభినందనీయమని సినీ నిర్మాత, ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. మంగళవారం ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు వి. రామకృష్ణ 77వ జయంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో గాయని గారపాటి జ్యోతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బోదిలపాటి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఘంటసాల లేని లోటును తీర్చిన గాయకుడు రామకృష్ణ, నేటితరం గాయకులకు ఆదర్శమన్నారు.కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ డైరెక్టర్ ఎ.నాగేంద్రకుమార్. ఉపకార్ ట్రస్ట్ ఇన్‌ఛార్జి సుధీర్, గంటి మురళీ, కొణతాల రాజు, త్యాగరాజు పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా తొలుత నిర్వహించిన వి.రామకృష్ణ సంగీత విభావరిలో జి.రామకృష్ణ, జ్యోతి పాడిన నా జీవనసంధ్యా సమయంలో, బొమ్మిడి సత్యనారాయణ, మాధురి పాడిన శ్రీమతి గారికి, ప్రకాష్, పావని పాడిన చిలికిచిలికి చిలిపి, మహ్మద్ ఖాన్, సుజాత పాడిన చెక్కిలి మీదా కెంపులు, బాబ్జి, కోమలి పాడిన నీ కన్నులలో, శ్యామ్‌సుందర్, సాత్విక పాడిన తెల్లావారే తెల్లవారే వంటి ఏరి కూర్చి గీతాలు ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించాయి. కీబోర్డు సోమేశ్, తబలాల ధనుంజయ్, అప్పలరాజు, ఫాడ్స్ బాబ్జి, కాంగో పైడిరాజు, గిటార్ వెంకటరమణ చక్కని సంగీత సహకారం అందించగా, పాటకు తగ్గ మాటలతో లక్ష్మీ సాత్విక వ్యాఖ్యానం ఆకట్టుకుంది.

మత్స్యసంపద లభ్యత దూరాభారం!

గ్రామసభలో మత్స్యకారుల ఆవేదన : ఉపాధి, సముద్ర తీరం కోతపై అభిప్రాయసేకరణ

గ్రామసభలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్లు ప్రమీల, దివ్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనేక మార్పుల నేపథ్యంలో సముద్రంలో వేటాడేందుకు ఎంత దూరం వెళ్తున్నా సరే తగినంత మత్స్యసంపద లభ్యం కావడం లేదని ఎయు పరిశోధనా విభాగానికి చెందిన కో ఆర్డినేటర్లు ప్రమీల, దివ్య తెలిపారు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో సముద్ర తీర కోత నివారణ చర్యలకు గ్రామసభ ద్వారా మత్స్యకారుల అభిప్రాయాలను తీసుకున్నారు. తీర ప్రాంతం రక్షణ, మత్యకారుల ఉపాధి ప్రధాన అంశాలుగా గ్రామసభ జరిగింది.

ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు గంటా నూక రాజు, కాసరపు నరసింగరావు, కొక్కిరి అప్పన్న తదితరులు మాట్లాడుతూ, గతంలో సముద్రంలో వేటాడే క్రమంలో 30 నుంచి 50 మైళ్ళ దూరంలో మత్స్యసంపద లభ్యమయ్యేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. తీర ప్రాంతంలో నివాసం ఉంటున్న మత్స్యకార కుటుంబాలు సముద్రపు ఆటు పోట్లకు గురైనప్పుడు ఆందోళన చెందుతున్నట్లు అభిప్రాయాన్ని వెల్లడించారు.హుదూద్ తుఫాన్ అనుభవాలను వెల్లడించారు. స్థానికంగా ఫిషింగ్ హార్బర్ నెలకొల్పడం ద్వారా స్థానిక మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని, తద్వారా వలసలను నివారించవచ్చని సూచించారు. తీర ప్రాంతం కోతకు గురి కాకుండా ఉండాలంటే రక్షణ గోడ నిర్మాణం అవసరమని స్పష్టం చేశారు.ఈ తరహా చర్యలు మత్స్యకారులకు కొంత మేరకైనా ఉపశమనం కలిగిస్తాయనిఅభిప్రాయం వెలిబుచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి రామారావు, ఎంపిడిఒ డాక్టర్ వి జానకి, పంచాయతీ విస్తరణాధికారి జి అప్పలరాజు, విఎంఆర్‌డిఎ, ఇఇ, మధుసూధనరావు, డిఇఇ కార్తీక, ఎఇఇ ప్రసాద్ పాల్గొన్నారు. మత్స్యకారుల అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్ర నివేదిక తయారు చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి

గీతం సదస్సులో నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి- మధురవాడ : కర్బన ఉద్గారాలను తగ్గించి, కాలుష్యరహిత సమాజం ఏర్పడాలంటే ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా హైడ్రోజన్‌ను పరిగణించాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బిఎస్‌సిఇ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింథటిక్ ఫ్యూయల్స్‌పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో ముగింపు రోజైన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భారత్, అమెరికా సహ వివిధ దేశాల నుంచి శాస్త్రవేత్తలు సమావేశంలో పాల్గొని, అణువిద్యుత్తుతో పాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని, అందుకు గల మార్గాలను వివరించారు.

ఎన్‌టిపిసి నిపుణుడు రిత్విక్ ఘోష్ మాట్లాడుతూ అణువిద్యుత్తు ఉత్పాదనతో పాటు న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లలో విడుదల అయ్యే నీటి ఆవిరి నుంచి కూడా హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చునని తెలిపారు. స్టీల్ పరిశ్రమతో పాటు షిప్పింగ్, ఏవియేషన్, రవాణా,

గీతం అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న నిపుణులు

ఎరువుల కర్మాగారాలలో హైడ్రోజన్ ఇంధనానికి డిమాండ్ ఉందని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో వివిధ చమురు కంపెనీల ఎల్‌పిజి పైపు లైన్ల ద్వారా హైడ్రోజన్ ఇంధనాన్ని సమాంతరంగా అవసరమైన ప్రాంతాలకు రవాణ చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. హెక్సగాన్ ఎజిలిటి సంస్థ విశ్రాంత అధికారి రవీంద్ర వశిష్ట మాట్లాడుతూ ప్రపంచంలో యురోపియన్ యూనియన్, అమెరికా, చైనా దేశాలలో హైడ్రోజన్ ఇంధన నిల్వ, కంటైనర్‌లు, పైపు లైన్ల ద్వారా సరఫరాపై అధ్యయనాలు చేస్తున్నారన్నారు. మన దేశంలో పైపులైన్ల ద్వారా హైడ్రోజన్ ఇంధనాన్ని సరఫరా చేయడం సురక్షితమన్నారు.

సమావేశాల ముగింపు సందర్భంగా విటి ఇండియా న్యూక్లియర్ ఎనర్జీ పాట్నర్‌షిప్ డైరెక్టర్ ప్రొఫెసర్ మైనేని గణపతి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఎస్ఆర్‌కె. ప్రసాద్, ఎల్అండ్‌టి సంస్థ ముంబై అధికారి టి.వెంకటేష్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, వివిధ దేశాల నుంచి శాస్త్రవేత్తలు, ఐఐటి, బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం నిపుణులు, గీతం విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అక్కయ్యపాలెంలో చోరీ

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెంలో ఒక ఇంట్లో చోరీ ఘటనపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. క్రైం ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 10న అక్కయ్యపాలెం రామకృష్ణ నగర్‌కు చెందిన హరిహరరావు కుటుంబసభ్యులందరూ హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల సందర్శనలో భాగం ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. పదిరోజుల పర్యటన తర్వాత మంగళవారం తిరిగొచ్చేసరికి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా బయట పడి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా, తులంన్నర బంగారు ఆభరణాలు, 500గ్రాములు వెండి ప్లేట్ చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే నాలుగోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ వెల్లడించారు.

కుసులవాడలో మైనింగ్ తవ్వకాలు వద్దు

28న ప్రజాభిప్రాయ సేకరణ విరమించుకోవాలి
సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని కుసులవాడలో మైనింగ్ అనుమతులకు ఈనెల 28న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ తక్షణమే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు ఈమెయిల్ ద్వారా వినతి పత్రం అందజేశారు

కుసులవాడ గ్రామ సర్వే నెంబరు 104లో చిన్న మెట్ట (ఎద్దు మెట్ట)లో గ్రావెల్, రఫ్ స్టోన్, క్వార్ట్ జైట్‌లను భారీయంత్రాలతో తవ్వి, వాహనాల్లో తరలించడం వల చుట్టు పక్కలున్న గొట్టుపల్లి, పందలపాక, తర్లువాడ, ముకుందపురం, రేగివాని పాలెం, చిన్నపాలెం, రాణిపేట, బోని, చందక, చిన్నాపురం, జగ్గరాజుపాలెం, సీతంపేట, ఏనుగులపాలెం, తర్లువాడ తదితర గ్రామాలతో పాటు ఆనందపురం మండలంలో సుమారు 20 నుండి 30 గ్రామాలు పూర్తిగా కాలుష్య కోరలలో చిక్కుకొని అల్లాడే పరిస్థితి ఉందన్నారు. పంట భూములు, సాగునీరు, తాగునీరు పూర్తిగా కలుషితమై, ప్రజల ఆరోగ్యం, ఆస్తులు సర్వ నాశనమౌతాయని ఆవేదన వెలిబుచ్చారు. ప్రజావ్యతిరేక మైనింగ్ ప్రతిపాదనలను వెంటనే విరమించాలని కలెక్టర్‌కు పంపిన వినతిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు విజ్ఞప్తి చేశారు.ఒకసారి మైనింగ్ తవ్వకాలకు అనుమతులిస్తే 20 ఏళ్ళ పాటు తవ్వకాలు కొనసాగుతాయని, పర్యావరణ విధ్వంసం అవుతుందన్నారు. ప్రజలకు, రైతులకు నష్టం చేకూర్చే మైనింగ్ తవ్వకాల ప్రతిపాదనలు నిలుపుదల చేయాలని కోరారు.

వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: చెత్త నుంచి సంపదను సృష్టించుకోవాలని డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని గొడిచెర్ల సంపద కేంద్రం వద్ద మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, హరిత రాయబారులకు తడి చెత్త ,పొడి చెత్త సేకరించి, వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు.గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త సేకరించే పద్ధతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు పార్వతి ,ఎంపీటీసీ నిట్ల దేవి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు

ప్రయివేటు హాస్టల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక పంచాయతీ కొండవెనుక పాలెం లో ఉన్న లవ్ ఇన్ యాక్షన్ చిల్డ్రన్స్ హోమ్ ప్రైవేట్ వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక అధికారులు తనిఖీ చేశారు .తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాస్ ,ఎంఈఓ నరేష్ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత వసతి గృహాన్ని తనిఖీ చేశారు .వసతిగృహం, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు.ఇరుకు గదుల్లో మంచాలు ఉండటం గమనించారు. వసతి గృహానికి అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. నిర్వాహకుడుతో అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్లో మాట్లాడారు. హాస్టల్ నిర్వహణకు వెంటనే అనుమతులు తీసుకోవాలని సూచించారు

ప్రైవేటు హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

వెల్లంకిలో కాలుష్యంపై జెవివి బృందం పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీలో పరిశ్రమల ద్వారా వెలువడిన కాలుష్య కష్టాలపై మంగళవారం జన విజ్ఞాన వేదిక(జెవివి)బృందం పరిశీలన జరిపింది. ఇటీవల 'కాలుష్య పొరల్లో వెల్లంకి గ్రామం' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి జన విజ్ఞాన వేదిక సభ్యులు స్పందించి వెల్లంకి గ్రామంలో పరిస్థితుల అధ్యయనం, పరిశీలనకు ప్రత్యేక పర్యటన జరిపారు. జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె. పరశురాం, జన విజ్ఞాన వేదిక పర్యావరణ పరిరక్షణ విభాగం జిల్లా కన్వీనర్ డాక్టర్ లక్ష్మణస్వామి పాలూరు ఆధ్వర్యంలో పర్యావరణ కమిటీ సభ్యులు సూరెడ్డి బాబూరావు, ప్రసాద్‌లతో కూడిన బృందం ముందుగా వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలుసుకొని కాలుష్యంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం స్ప్రింట్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ సందర్శించారు. కంపెనీలోనీటి కాలుష్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పరిశీలించేందుకు యత్నించగా, కంపెనీ సిబ్బంది నిరాకరించడంతో వెనుదిరిగారు. అనంతరం కంపెనీ నుంచి బయటకు విడిచిపెట్టిన నీటికాలుష్యాన్ని పరిశీలించారు

ఎవర్‌గ్రీన్ ప్లైవుడ్ కంపెనీ నుంచి వెలువడే కాలుష్యనివారణకు కంపెనీ యాజమాన్యం తీసుకుంటున్న జాగ్రత్తలపై కంపెనీ మేనేజర్ బిస్వాల్‌తో మాట్లాడి, పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెల్లంకి గ్రామ ఉపసర్పంచ్ కంచరాపు శ్రీను, ఎంపిటిసి సభ్యులు పడాల రాము గ్రామంలో కాలుష్య సమస్యలపై పలు విషయాలను జనవిజ్ఞాన వేదిక సభ్యులకు వివరించారు

విద్యార్థులతో మాట్లాడుతున్న జెవివి ప్రతినిధులు

స్ప్రింట్ కంపెనీలోకి జెవివి బృందాన్ని అనుమతించని యాజమాన్యం

అవార్డు గ్రహీతలకు అభినందన

అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

ప్రజాశక్తి-మధురవాడ : విజయవాడ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇండిపెండెన్సడే పరేడ్‌లో ఆర్మ్‌డ్ కంటింజెంట్‌గా విశాఖపట్నంలోని 16వ బెటాలియన్ మొదటి బహుమతి సాధించడంపై హర్షం వ్యక్తమౌతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రూ. 20 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందుకున్న బృందాన్ని మంగళవారం బెటాలియన్‌లో ఇన్‌ఛార్జి కమాండెంట్ సిహెచ్‌విఎస్.పద్మనాభరాజు, అభినందించారు. రాష్ట్రస్థాయి మొదటి బహుమతిగా సాధించిన నగదు రివార్డును పరేడ్‌లో పాల్గొన్న సభ్యులందరికీ స్వయంగా పంపిణీ చేశారు కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ, ఆర్‌ఐలు , ఆర్‌ఎస్‌ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

రఘులో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

మాట్లాడుతున్న బిజయ్‌కుమార్ సాహు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభమైంది. పరిశోధన, బోధనా రంగంలో అవసరమయ్యే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలి రోజున నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీనియర్ రీజినల్ మేనేజర్, ప్రోగ్రాం హెడ్(ఈస్ట్) డాక్టర్ బిజయ్ కుమార్ సాహు ప్రారంభోపన్యాసం చేస్తూ ఫార్మసీ రంగంలో ఆవిష్కరణలు, ఫండెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్, పేటెంట్స్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో రఘు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డాక్టర్ జగదీష్ పండా, ప్రోగ్రాం కోకన్వీనర్లు ప్రొఫెసర్ డాక్టర్ కె పద్మజ, డాక్టర్ కె పూర్ణ నాగశ్రీ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

పరిశుభ్రతతోనే కండ్ల కలకకు చికిత్స

ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి - ఆరిలోవ : కండ్లకలక అనేది అవగాహన చికిత్స అని, కండ్ల కలకకు వైరస్, బ్యాక్టీరియా, అలర్జీలు అనేవి ప్రధాన కారణమని ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ హిమబిందు అన్నారు. కండ్ల కలక అంటు వ్యాధి అని, వ్యాధి లక్షణాలను బట్టి చికిత్సా విధానం ఉంటుందన్నారు. వ్యాధి లక్షణాలు బట్టి కండ్ల కలకను మూడు రకాలుగా విభజిస్తారన్నారు. వైరల్ కండ్ల కలక సాధారణ జలుబు సంబంధమైనదని, అడెనోవైరస్ వలన వస్తుంది. దీన్ని తీవ్రమైన అంటు వ్యాధిగా పరిగణిస్తారన్నారు. రెండవది బ్యాక్టీరియా కండ్ల కలక. స్టెఫిలోకాకస్ అరియస్ వంటి బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి గల వారిని నేరుగా కలిస్తే ఇతరులకు త్వరితంగానే వ్యాపిస్తుందన్నారు. మూడవది అలెర్జీ కండ్ల కలక. ఇది పుప్పొడి, దుమ్ము, ధూళి, చుండ్రు వంటి అలెర్జీ కారణాలతో వస్తుందన్నారు. కండ్ల కలక వ్యాప్తిని నివారించేందుకు పరిశుభ్రత చాలా అవసరమని, సబ్బు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడగడం వల్ల ఇన్ఫెక్షన్ వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. కండ్ల కలక తేలికపాటిదని, దీనిని ఇంటి వద్దే నివారించుకోవచ్చన్నారు. అయితే కొన్ని కండ్లకలక లక్షణాలకు బట్టి నేత్ర వైద్యుని తప్పక సంప్రదించడం అవసరమన్నారు.

డాక్టర్ హిమబిందు

దొంగల సంచారంపై పోలీసుల హెచ్చరిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ నగరంలో అంతర రాష్ట్ర దొంగలు తిరుగుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసుల సూచనలు పాటించాలని భీమిలి నేర విభాగం పోలీసులు ప్రజలకు సూచించారు.తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. విలువైన వస్తువులను ఇళ్ళల్లో విడిచి ఊళ్లకు వెళ్లవద్దని సూచించారు. ఇళ్ల, వీధుల్లో సిసి కెమెరాలను అమర్చుకోవాలని స్పష్టం చేశారు. వీలున్నంత వరకు విలువైన వస్తువులను, బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు.

ఎంఎల్‌హెచ్‌పిలకు షోకాజ్ నోటీసులు జారీ దుర్మార్గం

ప్రజాశక్తి-పాడేరు: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు అల్లూరి జిల్లాలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న 33 మంది ఎంఎల్‌హెచ్‌పిలకు అల్లూరి జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ జమాల్‌భాషా షోకాజ్ నోటీస్ జారీ చేయడం దుర్మార్గమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమా మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. తక్షణం షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ ఈ సంఘటన తీవ్రంగా ఖండించి పెద్ద ఎత్తున నిరసనలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. ఇటీవలే మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వంలో ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కు ఉంటుందని తెలిపారని గుర్తు చేశారు. మరి ఈ షోకాజ్ నోటీసు పట్ల తక్షణ మంత్రి లోకేష్ స్పందించాలని, నోటీసులు జారీచేసిన డిఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.లేకుంటే ఉద్యోగ, మహిళా సంఘాలతో కలిపి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు

ఎమ్మెల్సీ బొత్సకు పలువురి అభినందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను జివిఎంసి నాలుగోవార్డు వైసిపి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని బొత్స నివాసంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సీతమ్మధార: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్సను వికెపిసి పిఐఆర్ యుడిఎ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సబ్బవరం మండల వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బొత్సను అభినందిస్తున్న కొండబాబు, చొక్కాకుల వెంకటరావు

ఘనంగా నర్సింగబిల్లి తల్లి పండుగ

ప్రసాద వితరణ చేస్తున్న కమిటీ సభ్యులు, దాతలు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు, నాయుడుతోటలో కొలువైన నర్సింగబిల్లి తల్లి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ప్రసాద వితరణ చేపట్టారు. ఈసందర్భంగా నాగరాజును అభినందించారు.

నేవల్ రక్షణరంగ పరిశోధనాభివృద్ధికి కృషి

● ఎన్ఎస్‌టిఎల్ 55వ వార్షికోత్సవంలో సంస్థ డైరెక్టర్ వర్గీస్ అబ్రహం

ప్రజాశక్తి-కరాస: భారత నావికాదళం అవసరాలకు అనుగుణంగా సముద్ర అంతర జలాల ఆయుధ వ్యవస్థలు, రక్షణరంగ పరిశోధన, అభివృద్ధికి నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) గణనీయమైన కృషి చేస్తోందనిసంస్థ డైరెక్టర్ డాక్టర్ వర్గీస్ అబ్రహం అన్నారు. ఈ రంగంలో దేశంలో ప్రీమియర్ ల్యాబ్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. మంగళవారం ఎన్ఎస్‌టిఎల్ 55వ వార్షికోత్సవ సంబరాలను (ల్యాబ్ రైజింగ్ డే)ను మానసి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశిష్ట శాస్త్రవేత్త, నావల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రంజన పాల్గొని వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ 1969 ఆగస్టు 20న కేవలం పదిమంది సిబ్బందితో స్థాపించబడిన ఎన్ఎస్‌టిఎల్ నేడు 186 మంది శాస్త్రవేత్తలతో సహా 603 మంది సిబ్బందితో పనిచేస్తోందన్నారు. నీటి అడుగున ఆయుధాలు, రక్షణ వ్యవస్థల పరిశోధనాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు .దేశ సాధికారత దిశగా 54వసంతాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్తలు, ఉద్యోగుల బృందాన్ని అభినందించారు. సముద్రజలాల్లో నీటి అడుగున అత్యాధునిక ఆయుధ వ్యవస్థను రూపకల్పన చేయడం ద్వారా దేశాన్ని శత్రుదుర్భేద్యంగా చేసేందుకు విశిష్ట కృషి చేస్తున్న ఎన్ఎస్‌టిఎల్‌పై భారత నావికాదళం మాత్రమే కాకుండా, యావత్ భారతదేశం ఎన్నో ఆశలు పెట్టుకుందన్నారు. ప్రస్తుతం ప్రపంచస్థాయి సామర్థ్యంలో నావికాదళ ఆయుధాల రూపకల్పనలో ఎన్ఎస్‌టిఎల్ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. నేవల్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధాల్కర్ మాట్లాడుతూ, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి ఎన్ఎస్‌టిఎల్, ఇండియన్ నేవీ పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని, రాబోయే ప్రాజెక్టుల కోసం ఇండియన్ నేవీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హెచ్ఎన్ దాస్, ఎన్ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ జెవన్ వర్మ పాల్గొన్నారు



ఎన్ఎస్‌టిఎల్ వార్షికోత్సవ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రంజన

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కృషి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -అనకాపల్లి

పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని వివిధ రకాల పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29, ఎంఎస్ఎంఈ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2024-29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, రెవెన్యూ డివిజనల్ రెవెన్యూ అధికారి చిన్నకృష్ణ, జిల్లా పరిశ్రమ శాఖ జిఎం శ్రీధర్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ హరి ప్రసాద్, అగ్నిమాపక శాఖ అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్‌లు విద్యాభివృద్ధికి కృషి చేయాలని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మండలంలోని విద్యా కమిటీ చైర్మన్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి దాకారపు నాగేశ్వరి దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్‌లు సుంకర లక్ష్మి, తామరాన దాసు, దొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేటి దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేసుకునే అనుమతులు రాష్ట్రాలకు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 21న జరిగే దేశవ్యాప్త బందును జయప్రదం చేయాలని మండల మాల, మాల ఉపకులాల సంఘ నాయకులు రాజాన బుజ్జి బాబు పిలుపునిచ్చారు. స్థానిక పిఎసిఎస్ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం తీర్పును గౌరవిస్తున్నప్పటికీ ఈ తీర్పు రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టు మరోసారి పునఃపరిశీలన చేయాలని కోరారు. బంద్‌కు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కోనపల్లి రామ్మోహన్రావు, పిల్లి అప్పారావు, విష్ణు, అర్జునరావు, దిమ్మల శివ, గుంటల అప్పారావు, మైలిపల్లి అప్పల నరసింహ తదితరులు పాల్గొన్నారు

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలో ఆగస్టు 20 నుండి సెప్టెంబర్ 18 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం జరుగుతుందని ఎం.అలమండ పశు వైద్యాధికారి మంజుషారాణి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి గ్రామ రైతు సేవా కేంద్రాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఆయా కేంద్రాల పశువైద్య సహాయకులు, సిబ్బంది ఈ టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

పాఠశాల శానిటేషన్ కార్మికులకు

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మండలంలో పాఠశాల శానిటేషన్ కార్మికులకు బకాయిపడ్డ 6 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, ఎండిఎం కార్మికుల ఒక నెల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని స్థానిక ఎంఇఒ అరుణ్‌కుమార్‌కు మంగళవారం సిఐటియు ఆధ్వర్యాన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎండిఎం జిల్లా అధ్యక్షులు శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులకు కడుపు నింపుతున్న ఎండిఎం కార్మికులకు నెల రోజులుగా సకాలంలో జీతాలు వెయ్యడం లేదని వాపోయారు. వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ నాయకులు పి.జానకి, టి వరలక్ష్మి, ఎండిఎం నాయకురాలు అప్పలకొండ, సత్యవతి, ఎండిఎం వర్కర్లు పాల్గొన్నారు.

రైతుల అనుమతులు లేకుండా

స్మార్ట్ మీటర్లు బిగించడం అప్రజాస్వామ్యం

రైతు సంఘం, సిపిఎం నేతలు అప్పారావు, బ్రహ్మాజీ

మాట్లాడుతున్న రైతు సంఘం నేత అప్పారావు

ప్రజాశక్తి-మునగపాక

రైతుల అనుమతులు లేకుండా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అప్రజాస్వామ్యమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ ధ్వజమెత్తారు. మండలంలోని చూచుకొండ గ్రామంలో మంగళవారం రైతు కమతాల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమతో కనీసం మాట కూడా చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా తమ మోటార్లకు మీటర్లు బిగించిన వైనాన్ని స్థానిక రైతులు నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రం మునగపాకతో పాటు పలు గ్రామాలలో స్మార్ట్ మీటర్ల బిగింపులను సిపిఎం, ఏపీ రైతు సంఘం రైతులతో అడ్డుకోవడంతో విద్యుత్ అధికారులు మోటార్లను బిగింపును ఆపారని తెలిపారు. అయితే మారుమూల గ్రామాలలో గుట్టుచప్పుడు కాకుండా దొడ్డిదారిన మీటర్లు బిగించడం దారుణమన్నారు. ఉచిత విద్యుత్తుకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పావులు కదపటం దురదృష్టకరమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులకు గుదిబండగా మారనున్న స్మార్ట్ మీటర్ల బిగింపును కూటమి ప్రభుత్వం రద్దు చేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పెంటకోట అప్పారావు, అంజి నాయుడు, దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో

అధిక దిగుబడులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి ద్వారా రైతులు పంటలపై అవగాహన కలిగించుకోవాలని, సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేయకుండా ఆధునిక పద్ధతిలో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఆర్‌వై అగ్రహారంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేయాలన్నారు. దీనివల్ల అధిక పురుగు మందులు వాడనవసరం లేదని చెప్పారు. మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మంచి నాణ్యమైన దిగుబడులు సాధిస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణం, చిరికి వెంకటరమణ, అచ్చం నాయుడు, ఏఈఓ లైలాదేవి, వ్యవసాయ సహాయకులు కళ్యాణి, హరీష్ పాల్గొన్నారు.

పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఘనంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు అచ్యుతాపురం ఎస్‌టిబిఎల్‌లోని తన స్వగృహంలో మంగళవారం ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి అనేకమంది అభిమానులు తరలివచ్చి విజయ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ నిర్వాహకులకు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బి రాందాస్, మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక మెయిన్ రోడ్‌లోని జనసేన కార్యాలయంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ కార్యకర్తలు, అభిమానుల నడుమ కేక్ కట్ చేశారు. తిమ్మరాజుపేట గ్రామంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బీమర శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేన, టిడిపి నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండలాధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, దాడి ముసలినాయుడు, కాంగ్రెస్ పరదేశి నాయుడు, ఆడారి శ్రీకాంత్, సూరిశెట్టి రాము, ఎల్లపు భాస్కరరావు, వేగి కృష్ణ, బివి రమణ, దొడ్డి భాస్కర్, దాడి భీమనాయుడు, ఆడారి సరోజినీ, కాంగ్రెస్ చందు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, కార్యకర్తలు

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ అప్పారావు

ఇంగ్లీష్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట డిపిఎన్ బాలురు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టుపై స్కూక్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. యలమంచిలి డిప్యూటీ డిఇఓ ఎం.అప్పారావు ఈ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆంగ్ల ఉపాధ్యాయలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాల విద్యార్థులందరూ ఇంగ్లీష్ సబ్జెక్టులో చదవడం, రాయడం, మాట్లాడం చేసే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఆచంట రవి, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

పంట నమోదను పరిశీలిస్తున్న తహశీల్దారు, ఎఒ

త్వరితగతిన పంట నమోదు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి

సిబ్బంది టీం వర్క్‌గా పని చేసి పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని మండల రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మి మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై కాంతమ్మ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ముసిడిపల్లి, ఏ.కొత్తపల్లి గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విఆర్ఓ, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ కలిసి టీంగా వర్క్ చేసి పంట నమోదు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం పంట ఎవరూ సాగు చేస్తున్నారో ఆ సాగుదారుడు పేరు మీద పంట నమోదు చేయాలన్నారు. ప్రతి రైతు పంట వేసిన ప్రతి సర్వే నెంబర్‌ను పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు

సన్యాసమ్మ అమ్మతల్లికి వెండి కంఠాభరణం

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి పంచాయతీ అల్లిపురం గ్రామానికి చెందిన గొర్లె కురుమ నాయుడు భార్య తమ్ముడు కుమారుడు గొర్రె కాశీ, తారప్రియ దంపతులు గ్రామ దేవత సన్యాసమ్మ అమ్మతల్లికి లక్షా 50వేలు విలువైన కేజీ వెండి కంఠాభరణాన్ని మంగళవారం ఆలయ ధర్మకర్త వరదపు రెడ్డి లలితా నాయుడు, గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కంఠాభరణాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కాశీ, తారప్రియ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, కెవి.రమణ, వెచ్చ రమేష్, పసుమర్తి విశ్వేశ్వరరావు, ఇట్లా నారాయణరావు, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

వెండి కంఠాభరణం అందిస్తున్న కాశీ, తార ప్రియ దంపతులు

బీమా పాలసీలపై జిఎస్‌టి తొలగింపునకు ఎంపీలు కృషి చేయాలి

ఎల్ఐసి ఎఒఐ డివిజన్ అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు ఆర్థిక భరోసాను కల్పించే బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం విధించే జిఎస్టి తొలగింపుకు ఎంపీలు కృషి చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎఒఐ) డివిజన్ అధ్యక్షులు నాగరాజు కోరారు. స్థానిక సత్యాస్ లక్ష్మీ గ్రాండ్ కళ్యాణ మండపంలో మంగళవారం అనకాపల్లి ఏఐఓ శాఖ సర్వసభ్య సమావేశం అనకాపల్లి శాఖ అధ్యక్షులు పెంటకోట సైదు నాయుడు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర రోడ్లు, శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపునకు కేంద్రంతో చర్చించారన్నారు. జీవిత ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ కేంద్రం విధిస్తుందని, దీనిని తొలగించేందుకు ఎంపీలు కృషి చేయాలన్నారు. జిఎస్టి విధింపుపై ఇప్పటికే ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు, ఏజెంట్ల యూనియన్లు, ఇతర సంఘాలు పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. జిఎస్టి విధింపు వల్ల ప్రీమియం పెరిగి బీమా కట్టేందుకు సుముఖత చూపలేదన్నారు. కేంద్రం పాలసీదారులపై జిఎస్టి విధించడం బాధాకరమన్నారు. జీఎస్టీ వల్ల జీవిత బీమా రంగాల అభివృద్ధికి ఆటంకంతో పాటు పాలసీదారులకు ఆర్థిక భారం అవుతుందని చెప్పారు. నిజంగా ఎన్డీఏ ప్రభుత్వానికి దేశ ప్రజలపై ప్రేమ ఉంటే జీఎస్టీని తక్షణమే ఉపసంహరించాలన్నారు.

ఎల్ఐసి ఎఒఐ నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం అనకాపల్లి శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా పెంటకోట సైదు నాయుడు, కార్యదర్శిగా కరణం మాణిక్యంరావు, కోశాధికారిగా రొంగలి అప్పారావు, ఉపాధ్యక్షులుగా ఐతా రాము, టి హరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా మజ్జి చిన అప్పారావు, జె.దుర్గారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కెఎల్ఆర్‌కె నాయుడు, రెసిడెన్సియల్ సెక్రటరీగా యస్ అప్పలనాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అనకాపల్లి బ్రాంచ్ మేనేజర్ ఉదయ సాగర్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు జేఎల్ఎన్ శాస్త్రి, శివాజీ, అనకాపల్లి బ్రాంచ్ ఏఓఐ నాయకులు నడిశెట్టి అప్పారావు, పీలా శ్రీనివాసరావు, గొర్లి శంకర్రావు, వెన్నెల సన్యాసిరావు, రొంగలి వెంకటరావు, అలంక నాగేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగరాజు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ద్వారానే కుటుంబాలు బలోపేతం అవుతాయని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం బుచ్చయ్యపేట మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు లక్షాధికారులుగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం బాలరాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపిపి దాకారపు నాగేశ్వరిదేవి, టిడిపి నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, అమరాపిన్ని వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానించాలని టిఎన్‌టియుసి అనకాపల్లి జిల్లా మీడియా కోఆర్డినేటర్ గొర్లి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పనులపై నిర్వహించే గ్రామసభల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీల కొరత కారణంగా రాష్ట్రంలో వ్యవసాయం కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి ఖర్చు కంటే కూలీల ఖర్చు అధికంగా ఉండడంతో రైతులు వ్యవసాయం చేసేందుకు బెంబేలెత్తుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈనెల 23న జరగనున్న గ్రామసభల్లో వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసేలా ఆదేశించాలని కోరారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయంలో సంస్కృత భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భారతి సంస్థ రాష్ట్ర సంపర్క్, విశ్రాంత సంస్కృత అధ్యాపకులు మహీధర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృత భాష పునరుద్ధరణకు గ్రంథాలయాలు, విద్యా సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాచీన గ్రంథాలలో నిండి ఉన్న విజ్ఞానాన్ని బహిర్గతపరచడమే కాకుండా ఆధునిక శాస్త్రీయ పరిశోధనలకు అనుగుణంగా సంస్కృత విజ్ఞానాన్ని అందరూ అలవరచుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, కోమాళ్లపల్లి నందన శర్మ, విల్లూరి జై శ్రీమాన్, కొణతాల మార్పుల్ నాయుడు, ఆవుపాటి త్రినాధ్, జయంతి శివప్రసాద్, ఓం ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనుల గురించి తెలుసుకుంటున్న దృశ్యం

ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పూడిమడకలో నిర్మించి తలపెట్టిన ఫిషింగ్ హార్బర్ పనులను మంగళవారం సిఐసిఈఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ఎంబి బెల్లయప్ప బృందం సందర్శించారు. హార్బర్ పనులు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితంగా చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎపి మారిటైం బోర్డు సిటిఓ శివశంకర్, మెరైన్ జాయింట్ డైరెక్టర్ వి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి పి ప్రసాద్, సహాయ సంచాలకులు జాస్మిన్, పూడిమడక గ్రామ మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, మెరుగు బాపునాయుడు, ఎం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

అనకాపల్లిలో పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి కార్యక్రమం అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఎపిసిసి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఐఆర్.గంగాధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని పునాదుల నుంచి నిర్మించి అన్ని రంగాల్లో భారత్ అభివృద్ధి సాధించే విధంగా రాజీవ్ గాంధీ కృషి చేశారని చెప్పారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధిలోకి రావడానికి రాజీవ్ గాంధీనే కారణమన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చుటకు నేటి యువత కృషి చేయాలని కోరారు. యువత రాజకీయాల్లోకి రావాలనే సదుద్దేశంతో 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సనేడ గజ్జాలు, ఎగ్గాడ భాస్కరరావు, కొల్లి సత్యారావు, గంట్యాడ సత్తిబాబు, బీసీ సంఘం నాయకులు గుతుర్తి అప్పారావు, దళిత నాయకులు ఒరేలా వెంకటరమణ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలపు రెడ్డి కోటేశ్వర రావు, తుట్టా రమణ, బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ళ సత్యనారయణ, సేనాపతి ఈశ్వరరావు, గుణబాబు, కట్టమూరి నూక అప్పారావు, అడ్వకేట్ సాయి, గణపతి, బుద్ధ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పట్టణంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంగిన రమణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఈ దేశ భవిష్యత్తు ముందుగానే ఊహించి సైన్సు టెక్నాలజీ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చినబాబులు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చిన ముషిడివాడ కూడలిలో కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, దేశంలో శాస్త్రసాంకేతికాభివృద్ధికి ప్రధానిగా రాజీవ్‌గాంధీ హయాంలోనే బీజం పడి అభివృద్ధి చెందిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం మళ్లీ పురోభివృద్ధిలోకి వెళుతుందన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముక్కా రామునాయుడు, ఆర్ఆర్.నాయుడు, ఎంవి. పాత్రుడు, కె.వరప్రసాదరావు, ఎండి అజీమ్ పాల్గొన్నారు

ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, కిల్లి రామమోహనరావు, బమ్మిడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళి

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మాడుగుల: పేదలకు అందించే వైద్యం పట్ల ప్రభుత్వం ఎందుకంత నిర్లక్ష్యం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట.నర సింహమూర్తి ప్రశ్నించారు. మంగళవారం మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. సూపరిండెంట్ చంద్రశేఖర్‌ను ఆసు పత్రిలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు పెట్టె భోజనం పరిశీలించారు అనంతరం వారు మాట్లాడుతూ, 8 మంది డాక్టర్లకు గాను ఎడుగురు ఉన్నారని, వీరిలో ఒకరు రోజు ఫ్యామిలీ ఫిజీషియన్ కు వెళుతున్నారని తెలిపారు. సోమవారం మాత్రం రోగులకు అవసరమైన మందులు ఇస్తున్నారని, మిగిలిన రోజుల్లో ఇవ్వలేదని, కొన్ని వైద్య పరీక్షలకు బయట ఉన్న ల్యాబ్‌కు వెళ్ళాల్సి వస్తుందని సూపరింటెండెంట్ దృష్టికి సిపిఎం నాయకులు తీసుకు వెళ్ళారు. కరెంటు లేకపోతే జనరేటర్ సౌకర్యం లేదని, ఇన్వర్టర్ సక్రమంగా పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎక్స్‌రే సౌకర్యంలేక రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందని తెలిపారు. డెంటల్, ఫిజియోథెరపీ వైద్యుల కొరత ఉందన్నారు. నూతన భవనానికి ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో అసంపూర్తిగా నిలిచి పోయిందన్నారు. వెంటనే పనులు పూర్తి చేసి రోగులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. ఎపిడిమిక్ సీజన్ కావడంతో జ్వరాలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి దొర, మండల నాయకులు కార్లే భవాని పాల్గొన్నారు.

వంటలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

చట్టప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించాలి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులకు చట్ట ప్రకారం అన్ని విధాలుగా ఆదుకొని, న్యాయం చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ నేత వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు.నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ అంబేద్కర్‌కు నిర్వాసితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు, ఇల్లులు, జీవితాలు త్యాగం చేస్తున్న రైతులను, మత్స్యకారులను, దళితులను, వివిధ వృత్తిదారులు , నిర్వాసితులకు ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి ఆదుకోవాలని కోరారు. పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో భూములు, ఇల్లులు త్యాగం చేసిన రైతులను నష్టపరిహారం, ప్యాకేజీ కొరకు సంవత్సరాల తరబడి కార్యాలయాలు చుట్టూ తిప్పడం చాలా అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు . ఇల్లు కోల్పోతున్న వారికి కి 25 లక్షలు, భూములు కోల్పోయిన కారణంగా ఉపాధి కోల్పోతున్న వారికి 15 లక్షలు చొప్పున భూములు స్వాధీనం చేసుకునే సంవత్సరాన్ని కటాఫ్ తేదీ గా పరిగణనలోకి తీసుకుని అప్పటి కి 18 సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజీ చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిర్వాసితుల నాయకులు తళ్ళ భార్గవ్, గంటా తిరుపతిరావు, ఎం.రాజేష్, ఎస్.గోవిందరావు, జీ.గోవిందరావు, వి.కృష్ణ, జీ.గోవిందరావు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామ మైన రాజయ్యపేటలో వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం వివిధ సర్వే నంబర్లు లో మొత్తం 12 ఎకరాల 60 సెంట్ల జిరాయితీ భూమికి ఎకరానికి 50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఎం గ్రామ కార్యదర్శి, పంచాయితీ పదవ వార్డ్ మెంబర్ మైలపల్లి మహేష్ బాబు కోరారు. మంగళవారం ఏపీఐఐసీ ఏ ఈ రాజేంద్ర కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఎకరానికి 50 లక్షల చొప్పున చెల్లించాలని కోరారు. చెట్లకు, నిర్మాణాలకు ఇతర ప్యాకేజీ ,పరిహారం కూడా ఒకేసారి చెల్లించాలని కోరారు .వినతిపత్రం అందజేసిన వారిలో స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ బొందలవు అప్పలరాజు, టీడీపీ సీనియర్ నాయకులు పిక్కి రాంబాబు పాల్గొన్నారు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో సమిద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనను మంగళవారం గొలుగొండ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో కల్పించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, సమిద ప్రాజెక్టు మేనేజర్ ఎల్.వరహాలబాబు, ఎండి సంధ్యారాణి, ఏఎన్ఎం కె.లక్ష్మీ, వి.సాయరాం, బాలనాగేశ్వరావు, బివివి.లక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడలో టీకాలు వేస్తున్న వైద్యులు

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో జిల్లా పశు గణాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశు వులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశామని పశు వైద్యాధికారి రాఘవమ్మ తెలిపారు. 25 మంది పాడి రైతులకు మినరల్ మిక్చర్ పాకెట్లు, టానిక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు, మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు, కండివరం పశు వైద్యాధికారి గణేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు జరిగే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేడీపేట వెటర్నరీ డాక్టర్ శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. టీకాలతో వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదటానికి ఉపయోగపడుతుందన్నారు.

ఆనందపురం : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఆనందపురంలో మంగళవారం సుమారు 340 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ పి అనిల్‌కుమార్ తెలిపారు. గాలికుంటువ్యాధి సోకితే పాడిపశువుల్లో పాలదిగుబడి తగ్గుతుందని, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతుందన్నారు. ప్రభుత్వపరంగా ఉచితంగా అందించే వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న వైద్యులు

స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాయకరావుపేటలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, తమ విద్యార్థులు ప్రతీ సంవత్సరం తమ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 2004వ సంవత్సరం నుండి ఇప్పటివరకూ సుమారు 2200 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ సేవానిరతి చాటుకున్నారన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకునే వారు మరో వ్యక్తి జీవితాన్ని నిలబెట్టినట్టేనని అన్నారు.మంగళవారం జరిగిన రక్తదాన శిబిరం ద్వారా 60 యూనిట్ల రక్తాన్ని మదర్ బ్లడ్ బ్యాంకు కు అందచేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యన్నారాయణ, మదర్ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ డి.శివ గుప్త, స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, రోటరాక్టు యంగ్ లీడర్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీ కృష్ణ
ఘనంగా శ్రీ ప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- నక్కపల్లి: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో భాగంగా రెండు రోజుల పాటు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వివిధ శాఖల (తుని,పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం) విద్యార్థుల మధ్య గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలను నిర్వహించారు. ఈ పాటల పోటీల నందు 6 వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ నేపథ్య గాయకులు శ్రీ కృష్ణ , కె బోర్డు ప్లేయర్ రవి శేఖర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీ కృష్ణ మాట్లాడుతూ కేవలం విద్యనే కాకుండా విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఆయన తెలిపారు. నిత్యం సాధన చేస్తే వీరు భవిష్యత్ లో మంచి గాయకులుగా రాణించగలరనడంలో అతిశయోక్తి లేదని ఆయన తెలిపారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరుస్తుందని తెలిపారు. విజేతలకు అతిథులు మరియు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ బహుమతులను అందచేశారు. విజేతలను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు , ట్రెజరర్ సిహెచ్. రామసీత అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఏపీపీఎస్సీ మెంబర్ సోనీవుడ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులతో గాయకుడు శ్రీ కృష్ణ

దోమల నివారణపై అవగాహన ర్యాలీలు

రోలుగుంటలో ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవంను నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సునీత ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, దోమలతో ప్రమాదకర డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున పరిశ భ్రతపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ వహించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు.

పరవాడ : ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పరవాడ గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షిక మాట్లాడుతూ వర్షాలు వల్ల దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా (బోదకాలు), మెదడు వాపు వ్యాధి వంటివి వస్తాయని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్-ఎస్.సాయిరాం, వైద్య సిబ్బంది జానకి రామన్, సతీష్, పీవీ రత్నం, చైతన్య, వెంకట్రావు, ఎల్‌టి అన్నపూర్ణేశ్వరి పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సమాజ భాగస్వామ్యంతో దోమల నివారణ నినాదంతో ప్రతిజ్ఞ చేసారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, వైద్య సిబ్బంది సత్యవతి, విజయలక్ష్మి, శివాజీ, పారా మెడికల్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం పిహెచ్‌సి ఆవరణలోనూ, ఉప్పవరం గ్రామంలోనూ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వసంత కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, వైద్య సిబ్బంది సునీత, ఉమా మహేష్, శాంతి, ఇందిర, గణేష్, ముఖేశ్, నాగేశ్వరరావు, డాక్టర్ మంజూష, నాగ వరలక్ష్మి, గాయత్రి, రమణ, దేముడమ్మ, కరుణ పాల్గొన్నారు.

చోడవరం : దోమల వల్ల కలిగే వ్యాధులు, దోమల నియంత్రణపై స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ వి రత్నభారతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, ముఖ్య అతిథి డాక్టర్ సూర్యవతి మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ నారాయణ మూర్తి, తాతాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

-రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని ఉత్తరవాహిని శ్మశానవాటికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నంలో 12 శ్మశానవాటికలను పార్కుల మాదిరిగా అభివృద్ధి చేయడానికి వివిధ ప్రైవేటు కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నారన్నారు. ఉత్తరవాహిని వద్ద వున్న శ్మశాన వాటిక సీఎంఆర్ సంస్థ అభివృద్ధి చేపట్టడానికి తీసుకున్నట్లు తెలిపారు. నర్సీపట్నం ట్యాంక్ బండ్, కేడీపేట అల్లూరి పార్కు, లంబసింగి గెస్ట్ హౌస్, బొర్రా గుహలను అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం మంజూరైన రూ. 4 కోట్ల నిధులతో రోడ్ల అభివృద్ధి చేస్తామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు.

ఇసుక దోపిడీదారుల అరెస్టు తప్పదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గత ప్రభుత్వ హయాంలో నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక రీచ్‌లో దోపిడికి పాల్పడిన వారి అరెస్టు తథ్యమని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం నర్సీపట్నం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, గబ్బాడ ఇసుక రీచ్‌పై కొంత మంది నాయకులు దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడికి పాల్పడిన కంపెనీ యాజమానిని వారం రోజుల్లో అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్, గండెం దొరబాబు, వెలగల వెంకటరమణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ కాలనీ, గొల్లవీధిలో కాలువల్లో పూడికలు తీయించారు. అనంతరం చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాతమల్లంపేట పంచాయతీలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మీ ఆనంద్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, టీడీపీ నాయకులు గెడ్డం నానాజీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మూర్తి

గ్రామ సభల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23న నిర్వహించనున్న గ్రామ సభలో భాగంగా అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలు పరిష్కరించాలని డిఎల్‌డిఒ ఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సమస్యలను గ్రామ సభల ద్వారా తెలుసుకొని వాటి పరిష్కారానికి ఉపాధి నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు, వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏపీవో గంగు నాయుడు, పిఆర్‌జెఈ వర్మ, ఏపీఎం రమణకుమారి పాల్గొన్నారు.

హత్యాచారంపై నిరసనల హోరు

-జూడాలు, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆందోళనలు

అనకాపల్లిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి -అనకాపల్లి

కోల్‌కతాలో యువ మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటన పట్ల పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చెప్పారు. రాజ్యాంగంపైనా, న్యాయవ్యవస్థలపైనా ప్రజలకు నమ్మకం పోయేలా బెంగాల్ ప్రభుత్వ పనితీరు ఉందని దుయ్యబట్టారు. అందుకే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసును సిబిఐకి అప్పగించిందని, దీంతో నేరస్తులు భయపడి అదే రోజు అర్ధరాత్రి సుమారు 300పైబడి గుండాలతో సంఘటన జరిగిన సెమినార్ హాల్‌ను పూర్తిగా ధ్వంసం చేసి సాక్ష్యాలను తారుమారు చేశారని పేర్కొన్నారు. దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వం, ప్రముఖుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళా వైద్యురాలిపై ఇటువంటి అమానుష సంఘటన జరగటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజకీయాలకు అతీతంగా నేరస్తులను తక్షణమే పట్టుకొని, ఈ నేర పరిశోధన సంస్థలకు సహకరించాలని కోరారు. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నేరస్తులు శిక్షల నుంచి తప్పించుకోకుండా తగిన సాక్ష్యాలతో పారదర్శకంగా విచారణ జరిపించి నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, డిడి వరలక్ష్మి, కాళ్ళ తెలయ్యబాబు, బి.నూక అప్పారావు, ఎం.రమణ, రాంమోహన్, ఈశ్వరరావు, భీశెట్టి అప్పారావు, గ్రైపూరి నర్సింగరావు పి.శ్రీనువాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

పిడిఎస్‌ఒ, స్త్రీ విముక్తి ఆధ్వర్యాన..

అనకాపల్లి : కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ స్త్రీ విముక్తి సంఘటన, పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రెండు సంఘాల నాయకులు జి.ఉష, లక్ష్మీకుమారి, ఎన్.భాస్కర్, సింధు, మణి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన...

చోడవరం : కోల్‌కత్తా ఆర్‌జి కార్ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ, దోషుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చోడవరం కొత్తూరు జంక్షన్లో మంగళవారం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, నాయకులు ఆర్.దేముడు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖలో ఎల్‌ఐసి ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన

అచ్యుతాపురం : కోల్‌కతా హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని మంగళవారం అచ్యుతాపురం జంక్షన్‌లో ప్రజా సంఘాల ప్రతినిధులు, వైద్యులు, కళాశాల విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ధర్మిరెడ్డి వెంకట్, డాక్టర్ అడిగర్ల సుధీర్, డాక్టర్ ఎన్.నాయుడు, స్వాతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు, రిటైర్డ్ ఉద్యోగి బి.శ్రీనివాసరావు, యువకులు పి.శివకృష్ణ, ఉపాధ్యాయులు రాజాన అప్పలనాయుడు, ఆడారి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన...

అచ్యుతాపురం : హత్యాచార నిందితులు కఠినంగా శిక్షించాలని కోరుతు యుటిఎఫ్ ఆధ్వర్యాన అచ్యుతాపురంలో మంగళవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి, మండల అధ్యక్షులు మద్దిల నానాజీ, ప్రధాన కార్యదర్శి కె.సుభాషిణి దేవి, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకటప్పారావు, తురాయి వెంకట సత్యనారాయణ, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖలో న్యాయవాదుల నిరసన

కొత్తకోట:కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రావికమతం మండల కేంద్రంలో సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మానవహారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, బెంగాల్ ప్రభుత్వం అసలు దోషులను దాచి పెడుతూ, ఒక్కరినీ మాత్రం అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. మహిళలకు ఎక్కడా రక్షణ లేకుండా

రావికమతంలో నిర్వహిస్తున్న మానవహారం

పోయిందని పేర్కొన్నారు.ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించేంత వరకు నిరసనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులకు ప్రాణరక్షణ లేకుండా పోయిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సత్యవతి, అంగన్ వాడి ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.సత్య వేణి, మధ్యాహ్నం భోజనం కార్మికులు, మండల అధ్యక్షురాలు 'ఎస్.అమ్మాజీ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, ఐకెపి మండల కార్యదర్శి జి సత్యవతి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి ఓపి గేట్ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జూనియర్ డాక్టర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వీరి నిరసనకు విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్, కార్యదర్శి వై.రాజవివేక్,

నరేద్రనగర్‌లో కొవ్వొత్తులతో ఐద్వా నాయకుల నిరసన

ఉపాధ్యక్షులు ఎం.ప్రియాకృష్ణవేణి, డాక్టర్ ఊహ రాపేటి, డాక్టర్ ఎన్.జగదీశ్వరరావు, డాక్టర్ కె.సంయుక్త, డాక్టర్ సి.శ్రీనాగకిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన 53 వార్డు నరేంద్రనగర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్ అధ్యక్షులు కె.అనూరాధ, నాయకులు ఎం.జయలక్ష్మి పాల్గొన్నారు. 28వ వార్డులో ఐద్వా నాయకులు కె.మణి ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, కె.సరస్వతి, మంగ, పిల్లలు పాల్గొన్నారు.

పోస్ట్ కార్డు ఉద్యమం

ఎంవిపి కాలనీ : నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యాన పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. పోస్టు కార్డులు రాసి భారత రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, సుప్రీంకోర్టు రిజిస్టార్, జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్, కోల్‌కత్తా హైకోర్టు రిజిస్ట్రార్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సర్వీస్ స్కీం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ హారిక, ఊర్మిళ, కార్తీక్, డాక్టర్ ఎ.ప్రభాకర్, డాక్టర్ ఆర్.హెప్సిబా పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదుల నిరసన

విశాఖ కలెక్టరేట్ : జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు మహిళా న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పప్పు అనూరాధ, కార్యదర్శి పి.హేమమాలిని పాల్గొన్నారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కాలేజీకి వెళ్లి అక్కడ జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపారు.

ఎల్ఐసి ఉద్యోగులు మంగళవారం సాయంత్రం ఎల్ఐసి ప్రధాన కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

కోల్‌కతా హత్యాచార ఘటన హేయం

ప్రజాశక్తి- సీతమ్మధార : కలకత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటన అత్యంత హేయమని జనసేన పార్టీ డాక్టర్ సెల్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మరో నిర్భయ, దిశ తరహాలో అత్యంత పాశవికంగా చోటుచేసుకున్న ఈ ఘటనలో దర్యాప్తును అత్యున్నత సంస్థ సిబిఐకి అప్పగించాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు .ఈ ఘటనలో బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన డాక్టర్స్ సెల్ నాయకులు డాక్టర్ రవీంధర్ పాల్గొన్నారు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన డాక్టర్స్ సెల్ నేతలు